సాక్షి పార్వతీపురం మన్యం

బుధవారం। 19। మార్చి। 2025



డ్వామాలో వింత డ్రామా..!

ఉపాధిహామీ పథకంలో అవినీతి రాజ్యమేలుతోంది. పోస్టుల భర్తీ పేరుతో అక్రమాలకు తెరతీశారు. - 8లో



ఆక్రమణలపై రెవెన్యూ కొరడా

గరివిడి మండలంలోని బొండపల్లి, కొండ శంభాం గ్రామాల్లో ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. - 8లో



ఇఫ్తార్	సహోర్
బుధ (సా)	గురు (ఉ)
6.11	4.52

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

● కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



పార్వతీపురంటౌన్: జిల్లాలో అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం మాట్లాడారు. 2029 నాటికి అందరికీ సొంతిల్లు ఉండాలన్నదే లక్ష్యమన్నారు. పీఎంఏవై 1.0లో మంజూరైన ఇళ్లు, వివిధ దశల్లో నిర్మాణం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువ ఆధారంగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఎస్సీలు, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించనుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలకు రూ.73.09 కోట్ల మేర అదనపు సాయం అందనుందన్నారు. 10,717 గృహాలు పూర్తి చేసేందుకు ఇది చక్కటి అవకాశంగా పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం గృహ నిర్మాణ దినోత్సవంగా పాటించి ఇచ్చిన లక్ష్యాలు సాధించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడులు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీడీ జి.ప్రసన్న తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు.

ఇల్లు చిన్నది... బిల్లు పెద్దది

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన నక్క లక్ష్మీనారాయణ తన కుమారుడి ఇంటిపై చిన్న గదిలో భార్యతో కలిసి నివసిస్తున్నాడు. ఒక ఫ్యాను, రెండు లైట్లు, టీవీ మాత్రమే వినియోగిస్తున్నారు. కోడలు పద్మ పేరుతో ఉన్న విద్యుత్ కనెక్షన్‌కు ఫిబ్రవరి నెల విద్యుత్ బిల్లు రూ.1495.99 రావడంతో లబోదిబోమంటున్నారు. రూ.122 విలువ చేసే విద్యుత్ వినియోగిస్తే బిల్లు మాత్రం వేలల్లో వచ్చిందంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదని, న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోండి



మారిక పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న ఏపీ రైతు సంఘం సభ్యులు, గిరిజనులు

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ శివారు మారిక గ్రామ ప్రాథమిక పాఠశాలకు వెళ్లకుండా జీతం తీసుకుంటున్న ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. నెలలో నాలుగురోజులు మాత్రమే పాఠశాలకు వెళ్లి జీతం తీసుకుంటున్నారని, బోధించేవారు లేక మారికలో 28 మంది, పాతమారికలో 14, కొత్తమారికలో 14 మంది పిల్లలు చదువుకు దూరమవుతున్నారన్నారు. హెచ్‌ఎం పనితీరుకు నిరసనగా పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి మంగళవారం ఆందోళన చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని కోరారు. కార్యక్రమంలో కె.ఆనంద్, బాబూరావు, అప్పలనాయుడు, రామకృష్ణ, ఆసు, తదితరులు పాల్గొన్నారు.

విచారణ వేగవంతం చేయండి

● శాసనసభ కమిటీ చైర్మన్ నెహ్రూకు పాల రైతుల సంఘం నాయకుల వినతి



నెహ్రూకు వినతి పత్రం అందజేస్తున్న పాలరైతు సంఘం నాయకులు

విజయనగరం ఫోర్ట్: విశాఖ డెయిరీపై విచారణను వేగవంతం చేయాలని పాల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుద్ధరాజు రాంబాబు డిమాండ్ చేశారు. కుంచనపల్లిలోని గెస్ట్ హౌస్‌లో శాసనసభ కమిటీ చైర్మన్ జ్యోతుల నెహ్రూను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. తగ్గించిన పాల ధరను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పాలరైతు సంఘం కార్యదర్శి కె.అజయ్‌కుమార్, డి సుబ్బారావు, తమటాపు పైడినాయుడు ఉన్నారు.

కూటమి తీరుపై గిరిజనాగ్రహం



పార్వతీపురం కలెక్టరేట్ వద్ద దీక్షల్లో పాల్గొన్న గిరిజన సంఘాల నాయకులు, రైతులు

- కలెక్టరేట్ వద్ద 48 గంటల పాటు నిరసన దీక్ష
- పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్
- విద్య, వైద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని వినతి
- మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ నినాదాలు
- సంక్షేమ పథకాలు అందడంలేదంటూ ఆవేదన

పార్వతీపురంటౌన్: ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలకు గిట్టుబాటు ధర ఉండడం లేదు... ప్రభుత్వం నుంచి రైతులకు పెట్టుబడి సాయం అందని ద్రాక్షగా మారింది.. విద్య, వైద్య సదుపాయాలు, ఉపాధి అవకాశాల కల్పనపై కూటమి ప్రభుత్వం కినుక వహిస్తోంది.. ప్రాజెక్టుల ఆధునికీకరణకు బడ్జెట్‌లో కనీస నిధులు కేటాయించలేదు.. వస్తున్న ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది.. జీడి పంటకు మద్దతు ధర లేదు.. గిరిజన ప్రాంత అభివృద్ధి ఎండమావిగా కనిపిస్తోంది.. అత్యవసర వేళ డోలీ కష్టాలు వీడడంలేదు.. పల్లెపండగ అంటూ మొదలెట్టిన పనులు 'ఎక్కడివేసిన గొంగలి అక్కడే' అన్న చందంగా ఉన్నాయి.. సంక్షేమ పథకాల హామీలన్నీ ఆచరణ శూన్యంగానే కనిపిస్తున్నాయంటూ గిరిజనులు ఆందోళన బాట పట్టారు.

చదువుకునేలా చూడండి

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులే నూటికి 95 మంది ఉన్నారు. వీరిలో చాలా మంది డబ్బులు ఖర్చుపెట్టి ప్రైవేటు కళాశాలల్లో చదువుకోలేని పరిస్థితి. ఎక్కువగా గిరిజనులు ఎంఏ, ఎమ్మెస్సీ, ఇంజినీరింగ్ వంటి కోర్సులు చదవడానికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. సకాలంలో ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక కష్టాలతో చదువుకు దూరమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి గిరిజనులకు విద్యావకాశాలను అందుబాటులోకి తేవాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలను ఎత్తేసే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు.

పార్వతీపురం కలెక్టరేట్ వద్ద సోమవారం చేపట్టిన 48 గంటల నిరసన దీక్షను మంగళవారం సాయంత్రం వరకు కొనసాగించారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కూటమి నేతలను డిమాండ్ చేశారు. వ్యయప్రయాసల కోర్చి ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు రాలేమని, గతంలో వలే సచివాలయ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. పలు డిమాండ్లను వినిపించారు. దీక్షల్లో గిరిజన సంఘాల నాయకులు ఎం.తిరుపతిరావు, లక్ష్మణరావు, కె.రామస్వామి, కె.సీతారాం, ఎస్.అప్పారావు, ఎస్.రామారావు, కె.ప్రసాద్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

జీడి పిక్క.. బతుకు పక్కా అన్నారు...

జిల్లాలోని రెండు ఐటీడీఏల గిరిజనులతో జీడి పిక్క.. బతుకు పక్కా అంటూ గతంలో టీడీపీ ప్రభుత్వమే మొక్కలు వేయించింది. కష్టపడి తోటలు పెంచిన గిరిజనుల నుంచి జీడి పిక్కలు కొనుగోలు చేసేవారే నేడు కరువయ్యారు. దళారులకు చౌకగా అమ్ముకోవాల్సి వస్తోందని గిరిజన రైతులు వాపోయారు. జీసీసీ పరిధిలో 80 కేజీల జీడిపిక్కల బస్తా రూ. 16 వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీతంపేట, కురుపాం, సాలూరు గిరిజన ప్రాంతాల్లో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

వైద్య కళాశాల ఏదీ?

గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. రూ.600 కోట్ల ఖర్చుతో ఏర్పాటుచేసే వైద్య కళాశాలను కూటమి ప్రభుత్వం రద్దుచేయడాన్ని గిరిజన సంఘాల నాయకులు తప్పుబట్టారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాల లేని జిల్లాగా పార్వతీపురం మన్యం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కురుపాం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాల్లో 100 పడకల ఆస్పత్రుల పనులను తక్షణమే పూర్తిచేసి మెరుగైన వైద్యసేవలందేలా చూడాలని కోరారు.

పంటలకు మద్దతు ధర కల్పించండి



ఇంటిల్లిపాదీ శ్రమించి కొండ పోడు వ్యవసాయం చేస్తున్నాం. తీరా పంట చేతికొచ్చేసరికి గిట్టుబాటు ధర ఉండడం లేదు. గిరిజన రైతుల శ్రమ దళారులపాలవుతోంది. మేము పండించిన జీడి పంటను ప్రభుత్వమే 80 కిలోల బస్తాను రూ.16వేలకు కొనుగోలు చేయాలి. గిరిజన ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయాలి.

– బిడ్డిక చుక్క, చప్పగూడ గిరిజన గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం

తాగునీరైనా కనీసం ఇవ్వండి



గిరిజన తండాల్లో తాగునీటి ఎద్దడి నెలకుంది. స్వచ్ఛమైన నీరు అందిన దాఖలాలు లేవు. వర్షాకాలం వస్తే గెడ్డల్లో కలుషితమైన నీటిని తాగడంతో చిన్నారులు, వృద్ధులు జ్వరాల బారిన పడుతున్నారు. వైద్యం కోసం ఆస్పత్రులకు తీసుకెళ్దామంటే సరైన దారి లేదు. పాలకులు, అధికారులు స్పందించి గిరిజన కష్టాలు గట్టెక్కించాలి.

– తాడంగి టిబమ్మ, సీతంపేట గిరిజన గ్రామం, పార్వతీపురం మండలం

చదువు లేదు.. ఉద్యోగాలూ లేవు..



గిరిజన ప్రాంత పాఠశాలలపై ఇటీవల కాలంలో పర్యవేక్షణ కొరవడింది. ప్రభుత్వ విద్యపై చిన్నచూపు అలుముకుంది. దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే ఆర్థిక స్థోమత లేక గిరిజన యువత చదువుకు దూరమవుతున్నారు. జిల్లాలో రెండు ఐటీడీఏలు ఉన్నా విద్య, ఉద్యోగాల కల్పన చర్యలు శూన్యంగానే కనిపిస్తున్నాయి. గిరిజన యువతకు మేలుకలిగించే నిర్ణయాలు తీసుకోవాలి.

– కొండగొర్రి ప్రసాద్, దోకుల గూడ గిరిజన గ్రామం, భామిని మండలం

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణ

● ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవ్ రెడ్డి



సందేహాలు నివృత్తి చేసుకుంటున్న పోలీస్ అధికారి

పార్వతీపురం రూరల్: పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను పట్టుకోవాలని ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి సూచించారు. జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, ప్రాపర్టీ, వాహనాల దొంగతనం, సీఆర్‌పీసీ కేసులు, మిస్సింగ్, చీటింగ్, సైబర్ నేరాలు, తదితర కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. సీసీ టీఎంఎస్‌లో గ్రేవ్ కేసు, నాన్‌గ్రేవ్ కేసులో పార్ట్-1, పార్ట్-2 సీడీలు అప్‌డేట్‌గా ఉండేలా చూసుకోవాలన్నారు. హత్య కేసుల్లో అభియోగ పత్రాలను వీలైనంత తొందరగా కోర్టులో దాఖలు చేయాలన్నారు. ఈ కోప్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై నిఘా పెంచాలన్నారు. అవసరమైతే స్టేషన్‌కు పిలిపించి వారి పూర్తి వివరాలను సేకరించి గాండీవం కోర్టులో అప్‌లోడ్ చేస్తే నేర చరిత్ర తెలుస్తుందన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను ఎస్పీ అందజేశారు. నేర సమీక్ష సమావేశంలో ఏఎస్పీ అంకిత సురానా, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బీ సీఐ రంగనాథం, డీసీఆర్బీ సీఐ ఆదాం, సోషల్ మీడియా, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ అప్పారావు, ఏఆర్ ఆర్ఐ రాంబాబు, పలువురు సీఐలు, ఎస్ఐలు, ఐఆర్‌పీడీ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

● నృత్యానందం



ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం విజయనగరంలోని పైడితల్లి అమ్మవారికి ప్రీతికరమైన మంగళవారం ఆలయ ఆవరణలోని ఆధ్యాత్మిక కళావేదికపై చిన్నారులు నృత్యప్రదర్శనలతో అలరించారు. పలు భక్తిగీతాలకు నృత్యాలు చేస్తూ భక్తులను మైమరిపించారు. కరతాళధ్వనులందుకున్నారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రసాద్ చేతుల మీదుగా సత్కారం పొందారు. – విజయనగరం టౌన్

● పెన్షన్ కోసం ఆందోళన



అధికారంలోకి వస్తే ఈపీఎఫ్ కనీస పెన్షన్‌ను రూ.9వేలు చెల్లిస్తామని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం హామీ ఇచ్చి ఏళ్ల తరబడుతున్నా పెన్షన్ మాత్రం పెంచలేదని పలువురు పెన్షన్‌దారులు ఆరోపించారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని పీఎఫ్ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. పెన్షన్ పెంచండి మహాప్రభో అంటూ చేతులెత్తి దండం పెట్టారు. రైల్వేలో రాయితీలు, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పి.శంకరరావు, కార్యదర్శి ఓ.ఎస్.ఎన్.మూర్తి, ఉపాధ్యక్షుడు వి.శేషగిరి, కమిటీ సభ్యులు ఆదినారాయణ, అప్పలరాజు, కె.రామారావు, కె. పాపారావు, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం గంటస్తంభం

● హామీల అమలుకు డిమాండ్



పట్టణాల్లో పేదలు నివసిస్తున్న చోటే జీవో నంబర్ 30 ప్రకారం స్థలాలను కేటాయించాలని, ఉన్న స్థలాలను క్రమబద్ధీకరించాలని సీపీఎం జిల్లా నగర కార్యదర్శి శంకరరావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పట్టణాల్లో నివసిస్తున్న పేదలకు 2 సెంట్లు భూమి ఇస్తామని చెప్పి 9 నెలలు గడుస్తున్నా మంజూరు చేయకపోవడంపై మండిపడ్డారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్ర ముగింపు సందర్భంగా కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా కోట కూడలి నుంచి విజయనగరం తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినదించారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.రమణ, పి.రమణమ్మ, జగన్‌మోహన్, ఆర్.శ్రీనివాసరావు, శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం గంటస్తంభం

రియల్ దందా..!

- బోర్డు తిప్పేసిన శ్రీ సాయిలక్ష్మి టౌన్ షిప్
- సుమారు రూ.7 కోట్ల వరకు దోపిడీ
- గగ్గోలు పెడుతున్న బాధితులు
- రియల్ ఎస్టేట్‌లో ఇంటి స్థలం కోసం ప్రతినెల రూ.3,999 చొప్పన వసూలు
- ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల వరకు వసూలు
- వీరఘట్టం, పాలకొండ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు

వీరఘట్టం/పాలకొండ రూరల్: ఆకట్టుకునే బ్రోచర్లు... రోడ్డుపక్కనే 14 ఇంటు 48 కొలతలతో తక్కువ ధరకే సొంతింటి స్థలం అంటూ పాలకొండకు చెందిన శ్రీ సాయి లక్ష్మీ టౌన్ షిప్ నిర్వాహకులు కొనుగోలుదారులను నమ్మించారు. సులభ వాయిదా పద్ధతిలో ప్రతినెలా రూ.3,999లు చొప్పున 50 వాయిదాలు చెల్లించి ఇంటి స్థలాన్ని సొంతం చేసుకోవాలంటూ ఊరించారు. దీనికి ఆకర్షితులైన పాలకొండ, వీరఘట్టం పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 350 మంది రూ.7కోట్ల వరకు చెల్లించారు. తీరా ఆరా తీస్తే అక్కడ ఉన్న స్థలం టౌన్‌షిప్‌ది కాదని, అసలు ఈ టౌన్ షిప్‌కు ఎక్కడా స్థలమే లేదన్న విషయం బయటపడింది. గత అక్టోబర్‌లో వెలుగుచూసిన మోసం వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. బాధితులను ఆందోళనకు గురిచేస్తోంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం...

పాలకొండ మండలం ఎల్.ఎల్.పురానికి చెందిన వారాడ రాజేంద్రనాయుడు పాలకొండ–శ్రీకాకుళం రోడ్డులో శ్రీ సాయిలక్ష్మీ టౌన్ షిప్ పేరిట అందమైన బ్రోచర్లను ముద్రించాడు. తాను వేసిన వెంచర్లలో ఇంటి స్థలాన్ని వాయిదాల పద్ధతిలో డబ్బులు చెల్లించి సొంతం చేసుకోవచ్చని ముమ్మర ప్రచారం చేశాడు. ప్రజలను నమ్మించేందుకు వీరఘట్టం, పాలకొండ, రాజాం మండలాల్లో 20 మంది ఏజెంట్లను నియమించుకున్నాడు. ఏజెంట్లకు కమీషన్లు ఆశ చూపి ఈ ప్రాంతాల్లోని సుమారు 350 మంది నుంచి నెలకు రూ.3,999 చొప్పున సుమారు రూ.7 కోట్ల వరకు వసూలు చేసి చివరకు బోర్డు తిప్పేశాడు. ఏజెంట్లు అందరూ స్థానికులు కావడంతో ఇంటి స్థలాలు తక్కువ ధరకు వస్తున్నాయని చెప్పడంతో ఇల్లు లేని పేద, మధ్య తరగతి ప్రజలు వీరి ఉచ్చులో పడ్డారు.

ఒక్కొక్కరు వాయిదా పద్ధతిలో సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించారు. కాలపరిమితి ముగిసినప్పటికీ ఇంటి స్థలాలు కేటాయించకపోవడంతో ఆందోళన చెందారు. ఇటీవల వీరఘట్టం వచ్చిన రియల్ ఎస్టేట్ నిర్వాహకుడిని స్థానికులు అడ్డగించారు. నెల రోజుల్లో అందరికీ డబ్బులు లేదా ఇంటి స్థలాన్ని ఇస్తానని నమ్మబలకడంతో విడిచిపెట్టారు. నెలరోజులు గడిచినా నిర్వాహకుడి నుంచి సమాధానం లేకపోవడంతో వీరఘట్టంలో ఏజెంటుగా ఉన్న పిన్నింటి వెంకటరమణపై బాధితులు ఒత్తిడి తెచ్చారు. ఆయన టౌన్‌షిప్ నిర్వాహకుడిపై వీరఘట్టం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తాజాగా ఎల్.ఎల్.పురానికి చెందిన శేఖర్ అనే ఏజెంట్ తాను కట్టిన డబ్బులు అడిగేందుకు నిర్వాహకుని ఇంటికి వెళ్లడంతో ఆయనను స్తంభానికి కట్టేసి కొట్టడంతో మరోసారి ఈ రియల్ దందా వెలుగులోకి వచ్చింది.



శ్రీ సాయిలక్ష్మీ టౌన్ షిప్ పేరిట ముద్రించిన బ్రోచర్

కేసు నమోదు చేశాం

వీరఘట్టంకు చెందిన పిన్నింటి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుపై శ్రీ సాయిలక్ష్మీ టౌన్ షిప్ రియల్ ఎస్టేట్ నిర్వాహకులపై గతేడాది అక్టోబర్‌లో కేసు నమోదుచేశాం. దర్యాప్తు జరుగుతోంది. పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం.

– ఎం.చంద్రమౌళి, సీఐ, పాలకొండ

రూ.60 లక్షలు కట్టించాను



శ్రీ సాయిలక్ష్మీ టౌన్ షిప్‌లో ఏజెంట్‌గా చేరాను. ఇంటి స్థలాల కోసం వీరఘట్టం ప్రాంతంలోని 41 మంది నుంచి సుమారు రూ.60లక్షలు కలెక్షన్ చేసి వారాడ రాజేంద్రనాయుడుకు ఇచ్చాను. నేను కట్టిన ప్రతిపైసాకు రసీదు ఉంది. నన్ను నమ్మి డబ్బులు కట్టిన వారికి నేను ఏం సమాధానం చెప్పాలి. ఇది ఘరానా మోసం. బాధితులకు న్యాయం చేసేలా ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– పిన్నింటి వెంకటరమణ, ఏజెంట్, వీరఘట్టం

మోసంపై ప్రశ్నిస్తే కొడతారా?



నేను మా ప్రాంతంలో నాకు తెలిసిన వారి నుంచి శ్రీ సాయి లక్ష్మీ టౌన్ షిప్‌లో ఇళ్ల స్థలాల కోసం రూ.కోటి50లక్షలు కట్టించాను. రాజేంద్రనాయుడును నమ్మి ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు కడితే ఇంటి స్థలాలు ఇవ్వకపోగా రాక్షసంగా స్తంభానికి కట్టి కొట్టారు. మోసంపై ప్రశ్నిస్తే ఇంత దారుణమా. పోలీసులు స్పందించి మోసం చేసిన వ్యక్తికి కఠిన శిక్ష పడేలా చూడాలి. బాధితులకు న్యాయం చేయాలి.

– శేఖర్, ఏజెంట్, ఎల్.ఎల్.పురం, పాలకొండ మండలం

క్లుప్తంగా

జీడి, మామిడి తోటలు దగ్ధం


మామిడి, జీడిమామిడి తోటలు కాలిపోతున్న దృశ్యం

వేపాడ: మండలకేంద్రం వేపాడ రెవెన్యూ పరిధి రాయుడుపేట రహదారిని ఆనుకుని ఉన్న జీడిమామిడి, మామిడి తోటలు మంగళ వారం సాయంత్రం దగ్ధమయ్యాయి. దీనికి సంబంధించి ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదం సమాచారం తెలుసు కున్న ఎస్.కోట అగ్నిమాపకసిబ్బంది సంఘ టనస్థలానికి చేరుకుని మంటలను అదుపుచే శారు. గ్రామానికి చెందిన గుత్తి గుణవతి, సత్య వతి, మోహన్, శ్రీను, సింహచలం తదితరు లకు సంబంధించిన జీడిమామిడి, మామిడి తోటలు సుమారు నాలుగున్నర ఎకరాలు కాలిపోయాయి. కార్యక్రమంలో ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఆఫీసర్ ఎస్.కె.మ దీనా, ఆర్‌వెంకటరావు, వై.నర్సింగరావులు పాల్గొన్నారు.

బాంబ్ బ్లాస్టింగ్‌లో వ్యక్తి మృతి


బోర కొత్తయ్య (ఫైల్)

భోగాపురం: ఎయిర్ పోర్టు నిర్మాణంలో భాగంగా జరిపిన బాంబ్ బ్లాస్టింగ్‌లో ఒక వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెం దిదాడు. ఈ సంఘ టనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రామచంద్రపేట గ్రామానికి చెందిన బోర కొత్తయ్య(35) విమా నాశ్రయం పనుల్లో కూలీగా పనిచేస్తున్నాడు. ఎయిర్‌పోర్టు సిబ్బంది కవులవాడ సమీపంలో రోడ్డు నిర్మించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న బండరాళ్లను తొలగించేందుకు బాంబులను ఏర్పాటు చేసి బ్లాస్టింగ్ చేశారు. ఈ బ్లాస్టింగ్‌లో కొత్తయ్య ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డాడు. వెం టనే ఎయిర్‌పోర్టు సిబ్బంది గాయపడిన కొత్త య్యను తగరపువలస ప్రైవేట్ ఆస్పత్రికి తరలిం చగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధా రించారు. మృతునికి భార్య ఎర్రమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు


గాయపడిన గెంబలి కాంతారావు

పార్వతీపురంటౌన్: పట్టణంలో మంగళవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. దీనిపై జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని దంగిడి వీధికి చెందిన గెంబలి కాంతారావు పనుల నిమిత్తం పార్వతీపురం పట్టణం పాత బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా పార్వ తీపురం నుంచి పాలకొండ రోడ్డుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో కాం తారావుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనిం చిన స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

ఐదు లీటర్ల సారా పట్టివేత


స్వాధీనం చేసుకున్న సారా క్యాన్‌తో ఎక్సైజ్ పోలీసులు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడు పేట సమీపంలో దాడులు నిర్వహిస్తుండగా వావిల పాడు గ్రామానికి చెందిన వి.దేముడు ఐదు లీటర్ల సారాతో పట్టుబడినట్లు ఎక్సైజ్ సబ్‌ఇన్ స్పెక్టర్ వీఎస్ రాజు తెలిపారు. దీంతో ఆ వ్యక్తి దగ్గర ఉన్న సారా క్యాన్ స్వాధీనం చేసుకునం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైతో పాటు సిబ్బంది సచివాలయం కార్య దర్శి టి.వెంకటేష్ పాల్గొన్నారు.

18 మద్యం బాటిల్స్ స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత వద్ద అక్రమంగా 18 మద్యం బాటిల్స్ తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు. మద్యం షాపు నుం చి అనుమతులు లేకుండా మద్యం తరలిస్తు న్నాడని సమాచారం రావడంతో నిఘా పెట్టి ఆ వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

డ్వామాలో వింత డ్రామా..!

- అక్రమార్కులకు అండగా అధికారులు
- అవినీతికి పాల్పడిన వారిపై చర్యలకు వెనుకడుగు
- గుర్ల, గంట్యాడ ఏపీఓలపై అవినీతి ఆరోపణలు వచ్చినా చర్యలు శూన్యం
- ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నట్లు గుర్ల ఏపీఓపై ఆరోపణలు
- లక్షలాది రుపాయల అక్రమాలకు పాల్పడినట్లు గంట్యాడ ఏపీఓపై ఆరోపణలు



జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: ఉపాధిహామీ పథకంలో పనిచే సే మేట్లకు ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఇప్పిస్తానని గుర్ల ఉపాధి హామీ పథకం ఏపీఓపై ఆరోపణలు వచ్చాయి. కలెక్టరేట్‌లో‌లో నిర్వహించే ప్రజా సమ స్యల పరిష్కార వేదికలో గార రామలక్ష్మి అనే మహిళ ఏపీఓపై ఇప్పటికే రెండుసార్లు ఫిర్యాదు చేసింది. అయినా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- గంట్యాడ ఉపాధి హామీ పథకం ఏపీఓ లక్షలాది రుపాయల అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో అతనిపై ఉపాధి పథకం రాష్ట్రస్థాయి అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని నరవ, లక్కిడాం, పెణసాం, మధుపాడ తదితర గ్రామాల్లో ఉపాధి హామీ వేతనదారుల నుంచి లక్ష లాది రుపాయలు వసూలు చేసినట్లు ఏపీఓపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికీ ఆ ఏపీఓపై ఎటువంటి చర్యలు తీసుకోలేదనే విమర్శ లు వినిపిస్తున్నాయి.
- జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు అక్ర మార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిస్తున్నాయి. అక్రమాలకు పాల్పడిన సిబ్బంది అధికారులకు కొంత మొత్తం ముట్టజెప్పి మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తు న్నాయి. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కిం దిస్థాయి సిబ్బంది సైతం అక్రమాలకు పాల్పడడా నికి సాహసిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తు న్నాయి. దీంతో స్థాయిని బట్టి ఉపాధి సిబ్బంది అక్ర మాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తు న్నాయి.

డిప్యూటీ సీఎం మాటలు ప్రకటనలకే పరిమితమా..?

నేను ప్రాతినిధ్యం వహిస్తున్న నీటి యాజమాన్య శాఖలో అవినీతికి తావు ఉండదు. ఎవరైనా అక్రమా లకు, అవినీతికి పాల్పడితే వారి తాట తీస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పలు సందర్భాల్లో వాఖ్యనించారు. డ్వామా అధికారులు, సిబ్బందిపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ ఏమీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవు తున్నాయి.

కొన్ని అక్రమాలే బయటకు

నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో జిల్లాలో పలు చోట్ల అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోప ణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలపై కొన్ని చోట్ల ఫిర్యాదు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ధైర్యం చేసి ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే అక్రమా లు బయటకు వస్తున్నాయి. ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది అక్రమాల గురించి ప్రస్తా వించేందుకు డ్వామా పీడీ ఎస్.శారదాదేవి వద్ద సాక్షి ప్రస్తావించడానికి ప్రయత్నించగా ఆమె స్పం దించలేదు.

బంకురువలసలో మాంగనీస్ అక్రమ తరలింపు..?


కుప్పలుగా ఉన్న మాంగనీసు ఓర్

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామ పం చాయతీ శివారు గ్రామం బంకురు వలస వద్ద అక్ర మంగా మాంగనీస్ తవ్వకాలు చేస్తూ తరలిస్తున్నా రని అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఎటువం టి లైసెన్స్ లేకుండా తవ్వకాలు చేపడుతూ గ్రేడింగ్ చేసి తరలిస్తున్నారంటూ సోమవారం గ్రీవెన్స్‌సెల్ లో ఆర్‌డీఓ రామ్మోహనరావుకు కొంతమంది వ్యక్తు లు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ జర పాలని తాహసీల్దార్ ఎం శ్రీనును ఆర్‌డీఓ ఆర్‌ఐ రామకుమార్ ఆదేశించగా తహసీల్దార్ కార్యా లయం సిబ్బంది క్వారీ ప్రదేశానికి వెళ్లి పరిశీలిం చారు. గతంలో ఇక్కడ మాంగనీసు ఓర్ తవ్వ కాలకు అనుమతులున్నా తదనంతరం అక్కడి తవ్వకాలపై ప్రభుత్వం నిషేధం విధించడంతో తవ్వకాలు నిలిపివేసినట్లు యజమాని ఫారూఖ్ తెలియజేశారు. గతంలో తవ్వి ఉంచిన మాంగనీసు కుప్పల్లో గ్రేడింగ్ చేసి మాంగనీసును తరలించేం దుకు తమకు అనుమతులున్నాయని, తవ్వకాలు చేపట్టడం లేదని వివరించారు. అలాగే ప్రతి ఏడాది రూ.10వేలు ప్రభుత్వానికి చలానా ద్వారా చెల్లించి గ్రేడింగ్ చేసుకుంటున్నట్లు చెప్పడంతో రెవెన్యూ సిబ్బంది నివేదికను తహసీల్దార్‌కు అందజేశారు. మంగళవారం విలేకరులు సంబంధిత ప్రదేశానికి వెళ్లి పరిశీలించగా మాంగనీసును గ్రేడింగ్ చేస్తున్న దాదాపు 50 మంది కూలీలు అక్కడ పనిచేస్తూ కనిపించారు.

కేవలం గ్రేడింగ్‌కు అనుమతి

మాంగనీసు గ్రేడింగ్ తరలింపుపై తహసీల్దార్ ఎం .శ్రీనును వివరణ కోరగా గతంలో అక్కడ ప్రభుత్వ అనుమతితో మైనింగ్ జరిగిందన్నారు. ప్రస్తుతం తవ్వకాలకు అనుమతి లేదని, కేవలం గ్రేడింగ్ చేసి తరలించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతు లున్నాయని తెలియజేశారు.

ఆకట్టుకున్న మోడల్ యూత్ పార్లమెంట్


మోడల్ యూత్ పార్లమెంట్ నిర్వహణలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివ ర్సిటీలో విద్యార్థులు మంగళవారం నిర్వహించిన 'యువ మంథన్ మోడల్ యూత్ పార్లమెంట్' ప్రద ర్శన ఆకట్టుకుంది. 'వికసిత్ భారత్ : కెరియర్ డెవ లప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఎంప్లాయ్‌మెం ట్ అనే అంశంపై విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ఈ ప్రదర్శన చేపట్టారు. విద్యార్థులే ఎంపీలు, స్పీక ర్, కార్యదర్శి వంటి భూమికలను పోషించి చర్చ లను ఉత్సాహంగా, ప్రతిభావంతంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించ డానికి, విమర్శనాత్మక ఆలోచనను ప్రేరేపించడం, పరిపాలనా వ్యవస్థపై అవగాహన కల్పించడం వం టి లక్ష్యాలతో ఈ ప్రదర్శన సదస్సు నిర్వహిం చామని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనప రిచిన విద్యార్థులకు సర్టిఫికెట్, అవార్డులను రిజిస్ట్రార్ అందజేశారు. కార్యక్రమంలో హ్యూమా నిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎం.శ రత్ చంద్రబాబు, మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొ ఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, డాక్టర్ కుసుమ్, మాన్సాస్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ కేవీలక్ష్మీపతి రాజు, డాక్టర్ ప్రేమాఛటర్జీ, డాక్టర్ నగేష్, డాక్టర్ ఎస్‌వీఎస్ సూర్యనారాయణ, డాక్టర్ దెబంజనా నాగ్, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

850కిలోల రేషన్ బియ్యం పట్టివేత

బలిజిపేట: మండలంలోని గలావల్లిలో 850కిలోల రేషన్ బియ్యాన్ని శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ ఎస్సై రామారావు, బలిజిపేట సీఎస్‌డీటీ రమేష్‌బాబులు మంగళవారం పట్టుకు న్నారు. వారికి అందిన సమాచారం ప్రకారం గలావల్లి గ్రామానికి చెందిన ఎం.రామారావు అక్ర మంగా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం చేసి ఇంటి వద్ద ఉంచాడు. దీంతో అధికారులు దాడిచేసి రామారావు ఇంటి వద్ద ఉన్న 850కిలోల బియ్యా న్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వ్యాపారి రామారావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుబడిన బియ్యంతో అధికారులు

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి జంక్షన్ వద్ద బొలెరో వ్యాన్‌లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు మంగళవారం అదు పులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గణే ష్ మాట్లాడుతూ వాహన తనిఖీలు చేపడుతుండగా ఎటువంటి అనుమతులు లేకుండా వాహనంలో తరలిస్తున్న 60 బస్తాలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశా మని చెప్పారు.

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మ వారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనం తరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌ల నేతృ త్వంలో సహస్ర కుంకుమార్చన చేశారు. మహిళ లు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమ లను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకు న్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తు లు అమ్మవారిని దర్శించి తరించారు. కార్యక్ర మాలను ఆలయ ఇన్‌ఛార్జ్ ఈఓ. కేఎన్‌వీడీవీ ప్రసాద్ పర్యవేక్షించారు.

ఘనంగా చండీయాగం


చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి చండీయాగం మంగళ వారం చదురుగుడి, వనంగుడిలలో ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయికిరణ్, దూసిశివప్రసాద్, తాతా రాజేష్‌లు శాస్త్రోక్తంగా యాగప్రక్రియను నిర్వహించారు. యాగం అనంతరం భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కబడ్డీలో కాంస్యం


విద్యార్థులకు ట్రోఫీ ఇస్తున్న డా.వరలక్ష్మి

శృంగవరపుకోట: సీబీఎస్ఈ స్టేట్‌జోన్ కబడ్డీ పోటీల్లో స్థానిక డా.వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కాంస్య పతకం సాధించారు. ఈ మేరకు స్కూల్‌లో జరిగిన వార్షికోత్సవంలో పాఠశాల వ్యవస్థాపకురాలు డాక్టర్ పి.వరలక్ష్మి కబడ్డీలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించి ట్రోఫీ అందజేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ విద్యాబోధనలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యావ్యవస్థను రూపొందించడంతో పాటు విద్యార్థులకు క్రీడ ల్లోనూ తర్ఫీదు ఇచ్చి తయారు చేయడంతో పాఠశాల అధ్యాపక బృందాన్ని ప్రశంసించారు.

జూడో విజేతలకు జేసీ అభినందనలు


జూడోపోటీల్లో విజేతలను అభినందిస్తున్న జేసీ

విజయనగరం: జూడో రాష్ట్రస్థాయి పోటీల్లో విజేత లుగా నిలిచిన నెల్లిమర్ల కేజీబీవీ విద్యార్థినులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తన ఛాంబ ర్‌లో మంగళవారం అభినందించారు. ఈ నెల 9న స్థానిక విజ్జి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీ ల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నెల్లిమర్ల కేజీబీవీకి చెందిన 8 మంది విద్యార్థినులు విజయవాడలో ఈ నెల 15.16 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందారు. విజేతల్లో జిల్లాకు చెందిన వై.అనూష 52 కిలోల విభాగంలో రెండోస్థానం, పి.జ్యోత్స్నరాణి తృతీయస్థానంలో నిలిచారు. బి.భార్గవి 63 కిలోల విభాగంలో రెండో స్థానంలో నిలవగా 70 కిలోల విభాగంలో పి.సత్య కూడా ద్వితీయస్థానంలో నిలిచింది. అదేవిధంగా వై.అనూష జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈ సం దర్భంగా వారిని జేసీ సేతుమాధవన్ అభినందించి, మరిన్ని విజయాలను సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు, జీసీడీఓ మాలతి, నెల్లిమర్ల కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.ఉమ, పీడీ ఎస్.రమ తదిరులు పాల్గొన్నారు.

సంకల్ప మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- 546 మందికి లభించిన ఉద్యోగావకాశాలు


జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోటలోని మహ రాజా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ స్టడీస్ ప్రాం గణంలో మంగళవారం నిర్వహించిన సంకల్ప మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లావ్యాప్తంగా వివిధ విద్యార్హతలుగల 1,542 మంది అభ్యర్థులు ఈ మేళాకు హాజరుకాగా వివిధ స్థాయిల్లో నిర్వహించిన పరీక్షలలో ప్రతిభ చూపిన 546 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. మరో 72 మందిని తదుపరి రౌండ్‌కు ఎంపిక చేసి నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ మేనేజర్ జి.ప్ర శాంత్‌కుమార్ తెలిపారు. దాదాపు 26 ప్రముఖ బహుళజాతి కంపెనీలు ఉద్యోగులను ఎంపిక చేశా యని, ఎంపికైన వారికి నెలకు రూ.13,000 నుంచి రూ.60,000 వరకు జీతాలు లభిస్తాయని పేర్కొ న్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎ.అరుణ్, కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్‌ఎస్‌రాజు, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి టి.భాస్కర్, ఎంప్లాయిమెంట్ యంగ్ ప్రొఫెషనల్ యశ్వంత్ సీడాప్ సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

శక్తి మొబైల్ యాప్‌పై అవగాహన

- కళాశాలలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో కార్యక్రమం


'శక్తి' యాప్‌పై అవగాహన కల్పిస్తున్న 'శక్తి' బృందాలు

విజయనగరం క్రైమ్: మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభు త్వం వినూత్నంగా రూపొందించిన శక్తి (ఎస్ఓఎస్) మొబైల్ యాప్‌ను ప్రతి మహిళ, యువత తన మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్పీ వకుల్ జిందల్ మం గళవారం పిలుపునిచ్చారు. మహిళల మొబైల్ ఫోన్ లో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్ష ణగా ఒక కుటుంబసభ్యుడు మీకు తోడు ఉన్నట్లేన న్నారు. ఆపద సమయాల్లో : శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్‌ను ప్రెస్ చేస్తే క్షణాల్లో పోలీసు బృం దం మీరున్న ప్రాంతానికి చేరుకుని రక్షణగా నిలుస్తా రని చెప్పారు. రాత్రి సమయాల్లో మహిళలు నైట్ షెల్టర్లలో వేచి ఉండేందుకు దగ్గరలో ఉన్న నైట్ షెల్ట ర్ల వివరాలు, సమీపంలోని పోలీస్ స్టేషన్ల ఫోన్ నం బర్లు, హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉం టాయని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మొబైల్ యాప్ పై 'శక్తి' బృందాలు జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని బస్టాండ్‌లు, ఆర్టీసీ కాంప్లెక్సు లు, రైల్వేస్టేషన్లు, ముఖ్యకూడళ్ళు, కళాశాలలు సం దర్శించి, మహిళలు, విద్యార్థినులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయని చెప్పారు.

ఆక్రమణలపై రెవెన్యూ కొరడా

- బొండపల్లి, కొండశంభాం ప్రాంతాల్లో అధికారుల పరిశీలన
- ఆక్రమణలు జరిగినట్లు గుర్తింపు
- సర్వే చేసి తొలగించేందుకు చర్యలు


బొండపల్లిలోని రాముల చెరువు ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు


కొండశంభాంలో గెడ్డవాగు ఆక్రమణలో ఉన్న ఆవుల షెడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ అధికారులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని బొండ పల్లి, కొండశంభాం గ్రామాల్లో జరిగిన ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. బొండపల్లి పం చాయతీలో గల రాముల చెరువు ఆక్రమణకు గురైందని, ఆక్రమణదారులు చెరువును ఆక్రమించారని, చెరువులో నుం చి రహదారిని కూడా నిర్మించారని కొన్ని రోజుల క్రితం గరివిడి తహసీల్దార్ కార్యాలయంలో చెరువు ఆయకట్టు రైతు లు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు తహసీల్దార్ సీహెచ్.బం గార్రాజు, ఆర్‌ఐ అచ్యుతరావుతో పాటు సర్వేయర్,స్థానిక వీఆర్‌ఓలు చెరువులో ఉన్న ఆక్రమణకు గురైన స్థలాన్ని మం గళవారం గుర్తించి ఆక్రమణలను తొలగించారు. చెరువు హద్దు ఎంతవరకు ఉందో చూపించి సరిచేయించారు. ఈ మేరకు గ్రామానికి చెందిన కొంతమంది రైతులు చెరువులో మరోవైపు కూడా ఆక్రమణలు ఉన్నాయని, పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించాలని కోరగా రాముల చెరువు మొత్తం విస్తీర్ణాన్ని కొలతలు వేసి నివేదిక సమర్పించాలని స్థానిక వీఆర్‌ఓ, సర్వేయర్‌ను తహసీల్దార్ ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు లెటర్ రాసి ఆక్రమణలో ఉన్న చెరువుగ ర్భాన్ని ఉపాధి హామీ పనుల ద్వారా చెరువు పరిధిలోకి తీసు కువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గెడ్డవాగులో పశువుల షెడ్డు నిర్మాణం

అదేవిధంగా కొండశంభాం పరిధిలో గల బొడ్లపేట గ్రామం లో ప్రభుత్వ గెడ్డవాగును స్థానికులు ఆక్రమించుకున్నారని తెలిసిన సమాచారం మేరకు గెడ్డవాగు ప్రాంతాన్ని పరిశీలిం చి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. గెడ్డవాగును మట్టితో కప్పి ఆవుల షెడ్డు నిర్మించారు. ప్రభుత్వ గెడ్డవాగు ఎంత మేరలో ఉందో సర్వే చేయించి గెడ్డవాగును ఆక్రమించిన వారికి నోటీసులు అందించి ఆక్రమణలు తొలగించేలా చర్య లు తీసుకుంటామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

ఇది ఏ ఊరు..!

- బోర్డుపై పేరు కానరాదాయె
- స్పష్టంగా ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం


స్పష్టంగా లేని దిబ్బగుడివలస ఊరి బోర్డు

పార్వతీపురం రూరల్: ఆర్‌అండ్‌బీ అధికారుల ఆధ్వ ర్యంలో ప్రతి ఊరి ప్రారంభంలో నేమ్ బోర్డు స్పష్టం గా కనిపించేలా ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ తమకేమీ పట్టనట్లు అధికారులు వ్యవహరించడం వల్ల వాహనాల్లో ప్రయాణం చేసేవారికి ఆయా గ్రామాల్లో బోర్డులు లేకపోవడం, ఉన్నవి స్పష్టంగా కనిపించకపోవడంతో గందరగోళానికి గురవుతు న్నారు. ఎక్కువ మొత్తంలో నిధులు వెచ్చించకుండా చేయాల్సిన ఇలాంటి చిన్న పనుల్లో కూడా సంబం ధిత అధికారులు నిర్లక్ష్యం చూపడం పట్ల వాహన చోదకులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించి స్పష్టంగా లేని ఊరిపేరుతో ఉన్న బోర్డులను సరిచే యాలని, అస్సలు ఊరు పేరుతో బోర్డులు లేని గ్రామాలకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


గందరగోళంగా లచ్చిరాజుపేట ఊరి బోర్డు


సరిగా కనిపించని తాళ్లబురిడి ఊరిబోర్డు


అక్షరాలు లేకుండా ఖాళీగా ఉన్న పుట్టూరు ఊరి బోర్డు


స్పష్టంగా లేని నర్సిపురం ఊరి బోర్డు